క్లుప్తంగా

గాడెల్లికి ఘన సత్కారం



కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన మచిలీపట్నం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గాడెల్లి డేవిడ్ శ్యామ్యూల్‌ను దళిత జేఏసీ నాయకులు ఆదివారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) దళిత సంఘ నాయకులతో కలిసి డేవిడ్‌ను శాలువా కప్పి సన్మానించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ రాజకీయాల్లో పదవులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి పదవి అప్పగించిన వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి పేర్ని నాని, యువ నాయకుడు పేర్ని కిట్టులకు డేవిడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దళిత జేఏసీ నాయకులు జక్కుల ఆనంద్, బూరగ రామారావు, యండ్రపాటి నాగేశ్వరరావు, భూపతి అంబేడ్కర్, థామస్ నోబుల్, కొక్కిలిగడ్డ శరత్, గడిదేశి రాజు, గడిదేశి బాలజేసు, చీలి రవీంద్ర, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమరవాణా

- తనిఖీల్లో పట్టుబడినా చర్యలు శూన్యం
- పలు గ్రామాల్లో పంచదార నోస్టాక్

పెడన: పట్టణంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల విజిలెన్సు అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కొందరు దుకాణాలు మూసేసి వెళ్లిపోవడం, దొరికిన వారు సిఫార్సులతో కేసులు లేకుండా మాఫీలు చేసుకోవడం పరిపాటిగా మారింది. అక్రమార్కులను పట్టుకున్నా కూడా చిన్న చిన్న కేసులతో సరిపెడుతున్నారనే విమర్శలున్నాయి. మరో పక్క కొన్ని గ్రామాల్లో రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి రేషన్ దుకాణంలో బియ్యంతో పాటు పంచదార తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కందిపప్పుతోపాటు ఇతర ఐటమ్స్ పండుగల సమయంలో ఇవ్వాలి.

తీవ్రస్థాయిలో సిఫార్సులు

పట్టణంలో ఇటీవల కాలంలో విజిలెన్సు, రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు వేర్వేరు సమయాల్లో దాడులు నిర్వహించారు. రేషన్ దుకాణాలపై కాకుండా రేషన్ బియ్యం విక్రయిస్తున్న అక్రమార్కులపై దాడులు చేశారు. పక్కా సమాచారంలో ఎవరెవరు రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారనే సమాచారంతో పాటు వారు ఎక్కడెక్కడ స్టాకు దాచి పెట్టారో తెలుసుకుని మరీ దాడులు చేశారు. అయితే దాడులు చేసిన సమయంలో నియోజకవర్గ స్థాయిలోని ప్రజాప్రతినిధి పీఏ ద్వారా తీవ్ర స్థాయిలో విజిలెన్సు అధికారులపై ఒత్తిడి తెచ్చి కేసులు లేకుండా చూసుకున్నారు. అలాగే రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు జరిపిన దాడుల్లో కూడా పట్టుబడిన వారిపై కేసులు పెట్టవద్దని జనసేన పార్టీ నాయకులు ఒత్తిడి చేయడం గమనార్హం. అప్పటికే విషయం లీకై మీడియాకి తెలిసిపోవడంతో అధికారులు చిన్నపాటి కేసులు పెట్టి చేతులు దులుపుకొన్నారనే ఆరోపణలు ప్రజలు నుంచి వెల్లువెత్తుతున్నాయి. అధికారులు రేషన్ బియ్యం తరలిపోకుండా అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఇటీవల తనిఖీల్లో పట్టుబడిన రేషన్ బియ్యం వద్ద అధికారులు(ఫైల్)

ఆ రెండు గ్రామాలకు పంచదార లేదు

మండలంలోని జింజేరు, అచ్చయ్యవారిపాలెం గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో పంచదార ఇవ్వడం లేదు. రేషన్ కార్డు కలిగిన వారు పంచదార రావడం లేదా.. ఎప్పుడు ఇస్తారని అడిగితే రాలేదని చెప్పడం గమనార్హం. రేషన్ డీలరు డిపాజిట్ కడితే పంచదార ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ఆయా గ్రామాలకు వెళ్తుంది. అయితే డీలర్లు డిపాజిట్ కట్టడానికి సిద్ధంగా ఉన్నా ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఆయా గ్రామాలకు సంబంధించి సాంకేతిక సమస్యల కారణంగా పంచదార ఇవ్వడం లేదని అధికారులు చెబుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

మండలంలోని జింజేరు, అచ్చయ్యవారిపాలెం గ్రామాలకు సంబంధించి ఎంఎల్ఎస్ పాయింట్లలో సాంకేతిక సమస్యలు ఉన్నాయి. అందు వల్ల ఆ రెండు గ్రామాలకు పంచదార వెళ్లడం లేదు. త్వరితగతిన సమస్య పరిష్కరించి పంచదార పంపించేలా చర్యలు తీసుకుంటాం. అలాగే రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నాం.

నాగమల్లేశ్వరరావు, పీడీఎస్ డీటీ, పెడన

స్వచ్ఛందంగా తూడు, జమ్ము తొలగించిన రైతులు

బంటుమిల్లి: మండలంలోని పెదతుమ్మిడి మేజర్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క, జమ్ములను ఆదివారం రైతులు స్వచ్ఛందంగా తొలగించారు. నీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో డ్రెయిన్ మరమ్మతులకు రైతులే నడుం బిగించారు. గత నెల రోజులుగా పంట పొలాల్లో మురుగు నీరు బయటకు వెళ్లే దారిలేక పెద్ద ఎత్తున నిలిచి పంట దెబ్బతినడానికి కారణమైంది. దీనిపై ఎమ్మెల్యేని కలిసి సమస్యను చెప్పినా పనులు జరగలేదు. అలాగే నీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వేలాది రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన రైతులు పంటలు దెబ్బతింటాయనే భయంతో వారే ఎకరాల లెక్కన నిధులు దాదాపు రూ. 50వేలు సేకరించారు. దీంతో డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క, జమ్ములను పెదతుమ్మిడి – బండ్లగూడెం గ్రామాల వద్ద ఉన్న వంతెనల మధ్యలో పాక్షికంగా తొలగించారు. దీంతో పంట పొలాల్లో నిలిచిన మురుగునీరు బయటకు పోయింది. అయితే మరల వర్షాలు పడితే చేతికి వచ్చే ముందు పంటలు నీటిపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో డ్రెయిన్ మరమ్మతులు చేపట్టాలని పెదతుమ్మిడి, చినతుమ్మిడి, జయపురం తదితర గ్రామాల రైతులు కోరుతున్నారు.



పెదతుమ్మిడి మేజర్ డ్రెయిన్‌లో తూడు, జమ్ము తొలగిస్తున్న రైతులు

పాస్టర్ ప్రసాదరావుకు నివాళి

మచిలీపట్నంటౌన్: నగరంలోని 42వ డివిజన్ బలరామునిపేటకు చెందిన పాస్టర్ కొడాలి ప్రసాదరావు మృతదేహాన్ని ఆదివారం మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రసాదరావు ఎంతో నిబద్ధత గల వ్యక్తి అని పేర్ని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ప్రసాదరావుకు నివాళులర్పించిన వారిలో కార్పొరేటర్‌లు చీలి రుచిత, మాచవరపు రాంప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, 42వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకుడు చీలి చక్రపాణి తదితరులు ఉన్నారు.



పాస్టర్ ప్రసాదరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పేర్ని నాని

తల్లిపై తనయుడి దాడి

కృత్తివెన్ను: ఆస్తి కోసం తల్లిపై తనయుడు దాడి చేయడంతో ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు కథనం మేరకు.. మండలంలోని నీలిపూడికి చెందిన చంద్రాల మధుసూదన్ తన తల్లి చంద్రాల కస్తూరి పేరున ఉన్న రెండెకరాల పొలాన్ని అమ్మమని ఏడాది నుంచి వేధిస్తున్నాడు. దీనిపై ఈ నెల 11వ తేదీన కస్తూరిపై మధుసూదన్ దాడి చేసి ఆమె మెడలోని బంగారు తాడు, చెవిదిద్దులు తీసుకుపోయాడు. గాయాలపాలైన కస్తూరి మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేడు వాణిజ్య పంటలపై అవగాహన

చల్లపల్లి: వక్క, కోకో, పామాయిల్, పనస వంటి వాణిజ్య పంటల సాగుపై స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎన్ఆర్ఐ మండవ శేషగిరిరావు, రైతు నాయకుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో కృష్ణాజిల్లా ఉద్యానవన శాఖ అధికారి జె.జ్యోతి, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సంచాలకులు డాక్టర్ డి.సుధారాణి, డాక్టర్ వి.మంజువాణి, ఉండవల్లి ఆగ్రోఫామ్ జనరల్ మేనేజర్ బి.హరికృష్ణలు పాల్గొంటారని తెలిపారు.

లంక వెంకటరత్నంకు నివాళి



చల్లపల్లి: కృష్ణాజిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ లంక వెంకటరత్నం(రత్తయ్య) వర్ధంతిని స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం, లక్ష్మీకాంతమ్మల చిత్రపటానికి కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రత్తయ్య కుమారుడు లంక కొండలు, లక్ష్మీపురం పీఏసీఎస్ అధ్యక్షుడు యార్లగడ్డ సోమశేఖరప్రసాద్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ



ఘంటసాల: శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఘంటసాలలోని సత్యసాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 31 మంది రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఘంటసాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు సేవా సమితి సభ్యులు రూ.20 వేలు విలువైన పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి కృష్ణాజిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, సేవాదళ్ కోఆర్డినేటర్ కె.అనిల్ కుమార్, జిల్లా బాలవికాస్ కోఆర్డినేటర్ డి.సాయిజ్యోతి, స్థానిక కన్వీనర్ పి.జయ ప్రసాద్, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త పద్మావతి, గొర్రెపాటి రామకృష్ణ, సేవా సమితి ఇతర సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

గుడ్లవల్లేరు: డోకిపర్రు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలను వేద మంత్రోచ్చారణ నడుమ వైభవంగా వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను భారీ అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

450 మందికి కంటి పరీక్షలు



చల్లపల్లి: స్థానిక వాసవీ క్లబ్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 450 మందికి కంటి పరీక్షలు చేసి 21 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కంటి వైద్యుడు మోహనరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపేట త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం

అవనిగడ్డ: మండలంలోని కొత్తపేట శ్రీరామా పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ నూతన చైర్మన్‌గా యలవర్తి రాజనాగ మునేశ్వరరావు (చిన్నా) ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు త్రీమెన్ కమిటీ సభ్యులుగా జెట్టి రాజేష్, బొప్పన శేషారావు బాధ్యతలు చేపట్టారు. సొసైటీ సీఈవో సజ్జ ధర్మతేజ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

వీరాంజనేయులకు సన్మానం



పాపవినాశనం(ఘంటసాల): ఇటీవల డీఎస్సీ ఉద్యోగానికి ఎంపికైన ఘంటసాల మండలం పాపవినాశనం ఎస్సీ కాలనీకి చెందిన దిట్టబోయిన వీరాంజనేయులును ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన హక్కులు, రిజర్వేషన్ల ఫలాలను వినియోగించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని వీరాంజనేయులకు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునిపల్లి బుజ్జి, జూనపూడి కిరణ్, మహిళా పోలీస్ నజరేయ కుమారి, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

నందివాడ: మండలంలో యూరియా సొసైటీల ద్వారా ఏ విధంగా అందుతుందని ఆదివారం పుట్టగుంట గ్రామ రైతులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అడిగి తెలుసుకున్నారు. రైతులు కలెక్టర్‌తో మాట్లాడుతూ.. యూరియా కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అరిపిరాల చేపల చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి, ఆర్ఐ గణేష్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన సీఐటీయూ జిల్లా మహాసభలు

మచిలీపట్నంటౌన్: నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న కృష్ణాజిల్లా సీఐటీయూ 12వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ధరల పెరుగుదల, ప్రభుత్వ వ్యవస్థల్ని ప్రైవేట్ పరం చేయడం, విద్యుత్ భారాలు మోపడం వంటి సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి వారితో మమేకం కావాలన్నారు. కృష్ణా జిల్లాలో గుర్తించిన 146 మంది అంతర్గత కార్మికులను శిక్షణా తరగతులకు రప్పించడం ద్వారా వారిలో ఉద్యమ స్ఫూర్తిని కలిగించాలన్నారు. విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల ముగింపు అనంతరం సీఐటీయూ కృష్ణా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కళ్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మాదల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా పరుచూరి ధనశ్రీ, మరో 19 మంది ఆఫీస్ బేరర్‌లుగా ఎన్నుకున్నారు.



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసన

నగరంలోని ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అమెరికా మద్దతుతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.